క్లుప్తంగా

విద్యా రంగంలో సేవలకు అవార్డు అందుకున్న ఫ్రాన్సిస్‌రెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ సింగారెడ్డి ఫ్రాన్సిస్‌రెడ్డి విద్యాభూషణ్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ అండ్ లీడ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా గత 25 ఏళ్లుగా విద్యారంగంలో అందించిన సేవలకు ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ. నరసింహారెడ్డి పాల్గొన్నట్లు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిగత వివాదాల నేపథ్యంలోనే హత్య

పట్నంబజారు: పాత గుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన సయ్యద్ మెహబూబ్ (23) హత్య వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో జరిగిందని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొంతకాలం కిందట మృతుడు మెహబూబ్ కుటుంబానికి, హత్యకు పాల్పడిన ఇర్ఫాన్‌కు మధ్య స్వల్ప వివాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇది మనస్సులో పెట్టుకున్న ఇర్ఫాన్ పక్కా ప్లాన్ ప్రకారం మెహబూబ్‌ను పిలిచి హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇర్ఫాన్ ఒక్కడే హత్య చేశాడా, అతనికి ఎవరైనా సహకరించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసులో నిందితుడైన ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని పాత గుంటూరు సీఐ ఎం.వి.సుబ్బారావు తెలిపారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

జిల్లా పరిషత్ సీఈవో జెల్లి మోహనరావు

పొన్నూరు: పంచాయతీల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని జెడ్పీ సీఈవో జెల్లి మోహనరావు తెలిపారు. ఆయన బుధవారం పొన్నూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. అభివృద్ధి పనుల రికార్డుల్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలో అనుమతులు లేకుండా వేసే వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని పంచాయతీరాజ్ అతిథి గృహాల్ని అభివృద్ధి చేసి లీజు ప్రాతిపదికన టెండర్‌దారులకు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీవీఐటీ అధ్యాపకుడు దుర్గారావుకు డాక్టరేట్



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీవీఐటీ) కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకుడు నాగాయలంక దుర్గారావు డాక్టరేట్ అందుకున్నారు. ఆయన స్కిన్ క్యాన్సర్ డయాగ్నసిస్ విత్ ఎన్‌హ్యాన్స్‌డ్ ఆప్టిమైజేషన్‌పై ప్రొఫెసర్ డాక్టర్ జి. సుధారాణి పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎన్. కుమారస్వామి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వై. భానుమూర్తి అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థంగా అమలుచేయాలి

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థంగా అమలు చేసి ఆయా వర్గాలకు సామాజిక న్యాయాన్ని సక్రమంగా అందించాలని సామాజికవేత్త డాక్టర్ గొల్లమూడి రాజసుందర్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. దళిత గిరిజన సంఘ నాయకులతో కలసి బుధవారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అట్రాసిటీ చట్టం చాలా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. 2014 నుంచి 2018 వరకు గుంటూరు జిల్లాలో 200 అట్రాసిటీ కేసులు నమోదైతే కేవలం మూడు సంఘటనలోనే నిందితులకు శిక్షలు పడ్డాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి ఎస్సీ, ఎస్టీ నాయకులతో హై పవర్ కమిటీని సమావేశపరచి, చర్చించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీలకు సమగ్ర సామాజిక న్యాయం అందించాలని రాజసుందర్ బాబు కోరారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అసమానం



నివాళులర్పిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



మహనీయుల చిత్రాలతో విద్యార్థులు, డీవైఈవో వెంకటేశ్వరరావు, ఖాసిం

- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- పలుచోట్ల పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు

నెహ్రూనగర్/గుంటూరు ఎడ్యుకేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని హిందూ కాలేజీ సెంటర్‌లోని పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఏకంగా 56 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి, ప్రాణాల్ని పణంగా పెట్టారని గుర్తు చేశారు. మొదటి నుంచి గాంధీ భావాలకు ప్రభావితమై అహింసా మార్గంలోనే నడిచారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, దుర్గా ప్రసాద్, మొగిలి సతీష్ కుమార్, ఆర్య వైశ్య, వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

✦ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత గుంటూరు ఎల్బీనగర్‌లోని నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఆంధ్ర రాష్ట్రావతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత పొట్టి శ్రీరాములు బాటలో నడిచి, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలువురు ప్రముఖ తెలుగు కవుల్ని స్మరించుకుంటూ రూపొందించిన కార్యక్రమాల్ని వీక్షించి, వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసిం, ప్రధానోపాధ్యాయుడు డి.తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు మాధవీలత పాల్గొన్నారు.



అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవోపా ప్రతినిధులు

✦ రాష్ట్రావతరణ కోసం ప్రాణాల్ని అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నిత్యం స్మరించుకోవాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) జిల్లా అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవోపా జిల్లా కార్యాలయంలో బుధవారం రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. బ్రహ్మం మాట్లాడుతూ అమరజీవి స్ఫూర్తితో తెలుగు వారంతా ఐక్యంగా ఉంటూ, పేదవారిని ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపా జిల్లా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రతినిధులు మద్ది సాయి రమేష్, నాగమణి, చామర్తి రమేష్, గోపాలరావు, సత్యనారాయణ, మద్ది కోటిరత్నం పాల్గొన్నారు.

✦ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని 10వ కార్పొరేటర్ షేక్ మీరావలి పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని పాత గుంటూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూసూరు నాగేశ్వరరావు, ఆరుబండ్ల వెంకట కొండారెడ్డి, షేక్ బాబు, పున్నారావు పాల్గొన్నారు.



పాత గుంటూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రాంతీయ గ్రంథాలయంలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు

✦ ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో బుధవారం రాష్ట్రావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో ఆధునిక పద్ధతుల పరిశీలన

యూనిడో ప్రతినిధులతో కలిసి విదేశాల్లో పర్యటిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ది ఇంటర్నేషనల్ వియన్నా ఎనర్జీ అండ్ క్లైమేట్ ఫోరం కాన్ఫరెన్స్‌లో భాగంగా స్వీడన్‌లోని స్వీడిష్ ఎన్విరాన్మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లను యునిడో ప్రతినిధులతో కలసి నగర కమిషనర్ కీర్తి చేకూరి పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, క్లీన్ సిటీల నిర్వహణలో భాగంగా అక్టోబర్ 29 నుంచి నవంబర్ 5 వరకు స్వీడన్, ఆస్ట్రియాల్లో పర్యటిస్తున్న కమిషనర్ స్వీడన్‌లోని స్టాక్ హోంలో స్వీడిష్ ఎన్విరాన్మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్, వాటర్ ఇన్నోవేషన్ సెంటర్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఎనర్జీ ప్లాంట్లలో వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న ఆధునిక విధానాలు, వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే నివాసాలు, సంస్థల నుంచి ప్లాంట్‌లకు వ్యర్థాలు తరలించడం, కార్మికులతో కాకుండా యంత్రాలతో వ్యర్థాలను తడి, పొడి, ప్లాస్టిక్, ఇతర వస్తువులుగా వేరు చేయడం, వాటిని తిరిగి ఉపయోగపడే వస్తువులుగా మార్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం నేరుగా ఇళ్ల దగ్గర నుంచి వ్యర్థాల సేకరణ చేసే విధానాన్ని తెలుసుకున్నారు. లింకోపింగ్ యూనివర్సిటీ బృందంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కి సంబంధించి వివిధ అంశాలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.



బృంద సభ్యులతో కలసి ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

టెక్స్‌టైల్ పరిశ్రమను ఆదుకోవాలి

ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కోటిరావు

కొరిటెపాడు(గుంటూరు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి టెక్స్‌టైల్, స్పిన్నింగ్ పరిశ్రమలకు 2015 నుంచి రావాల్సిన రూ.1,500 కోట్ల రాయితీలను విడుదల చేసి పరిశ్రమను ఆదుకోవాలని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ పి.కోటిరావు కోరారు. స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015 నుంచి 2023 మార్చి 31వ తేదీ నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇన్‌సెంటివ్(రాయితీ) రూపంలో రావాల్సి ఉందని చెప్పారు. అసోసియేషన్ గౌరవ చైర్మన్ లంకా రఘురామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2021లో రూ.250 కోట్లు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. అసోసియేషన్ వైస్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో కోశాధికారి పి.చలపతిరావు, వైస్ చైర్మన్లు కె.నాగిరెడ్డి, సత్యనారాయణ, పూర్ణ వీరయ్య, బెనర్జీ, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కోటిరావు

కళ్లం హరనాథరెడ్డి జీవితమే సందేశం



హరనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కృషితో నాస్తి దుర్భిక్షం, కష్టే ఫలి అనే సూక్తులు కళ్లం హరనాథరెడ్డి జీవన ప్రస్థానానికి సరిపోతాయని నాటక రచయిత, దర్శకుడు కావూరి సత్యనారాయణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం హరనాథరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ హరనాథరెడ్డి జీవితమే ఒక సందేశం అనడంలో అతిశయోక్తి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఇంజినీర్ ఎన్.సదాశివం, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బాపట్లకు చెందిన యువతి ఎస్వీఎన్ కాలనీలో ఓ హాస్టల్‌లో ఉంటూ నగరంలోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటోంది. గత నెల 30న కాలేజీకి వెళుతున్నట్లు చెప్పి హాస్టల్ నుంచి బయటకు వచ్చి కనిపించకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలిండియా త్రోబాల్ జట్టుకు విజ్ఞాన్ విద్యార్థిని ఎంపిక

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సీఎస్ఈ రెండో సంవత్సరం విద్యార్థిని కిలారు భార్గవి ఆలిండియా త్రోబాల్ జట్టుకు ఎంపికైందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణం బుధవారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజునూర్‌లో జరిగిన 43వ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్–2023 టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రదర్శించి, జాతీయ జట్టుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జనవరిలో దుబాయ్‌లో జరిగే ఇంటర్నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని తెలియజేశారు. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు రోజుల పాటు జరిగిన లీగ్ కమ్ నాకౌట్ మ్యాచ్‌లలో పది రాష్ట్రాలకు చెందిన జట్లు పోటీ పడ్డాయని తెలిపారు. ఇందులో తమ యూనివర్సిటీకి చెందిన రెండో సంవత్సరం విద్యార్థులు కిలారు భార్గవి, కేతినేని గాయత్రి, మామిళ్లపల్లి తేజస్వి, కట్టా వైష్ణవి, మొదటి సంవత్సరానికి చెందిన శ్రీవర్షిత ఇంకుర్తి పాల్గొన్నారని తెలిపారు. ఆలిండియా త్రోబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థినితో పాటు ఆంధ్రప్రదేశ్ టీమ్ తరపున పాల్గొని రెండో స్థానంలో నిలిచిన విద్యార్థుల్ని రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్, కోచ్‌లు అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ రఘునాథన్, సిబ్బంది

రైళ్లలో చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలో ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాల చోరీ కేసులో చేసే ఇద్దరు నిందితుల్ని బుధవారం రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం....అక్టోబర్ 10న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల నుంచి రూ.2.30 లక్షల విలువ చేసే ఆభరణాల్ని దొంగలు చోరీ చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు అక్టోబర్ 29న కేసు నమోదు చేశారు. గుంటూరు రైల్వే స్టేషన్ తూర్పు విభాగంలో రోజు వారి తనిఖీల్లో భాగంగా బుధవారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా, వట్టిచెరుకూరు మండలం వింజనంపాడుకు చెందిన కాకుమాను దయాకర్, కాకుమాను విజయ్‌కుమార్ అనే ఇద్దరు అన్నదమ్ములు పారిపోయేందుకు యత్నం చేశారు. జీఆర్పీ పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరనీ తనిఖీ చేయగా, ప్యాంటు జేబులో బంగారు ఆభరణాలు, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్ చూసి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎస్.కె.రెడ్డి, కానిస్టేబుల్ వలి, రవి, ఆర్పీఎఫ్ ఎస్ఐ బాషా, ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్‌ను అభినందించారు.



నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణులు వై. రమేష్, డాక్టర్ శ్రీలక్ష్మి, బ్రెస్ట్ క్యాన్సర్ సర్జన్ ఏ. ప్రియాంక, గైనకాలజిస్ట్ డి. ప్రియాంక, దంత వైద్యుడు ఎం. రాజశేఖర్. ఎం. రాధిక కల్యాణ్ పాల్గొన్నారు. వ్యాధుల సంక్రమణ, ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఎన్. మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరం అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్ కాసుశాయమ్మ మున్సిపల్ హైస్కూలులో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పేదల గడప వద్దకు వైద్యాన్ని చేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. నేరుగా వైద్యుల్ని ఇంటి వద్దకు పంపి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడంతోపాటు, అవసరమైతే దగ్గర్లో ఉన్న ఆసుపత్రిలో చికిత్స అందించే సదుపాయాల్ని గతంలో ఏ ముఖ్యమంత్రీ కల్పించలేదని చెప్పారు. అది కేవలం సీఎం వై.ఎస్.జగన్ పాలనలోనే సాధ్యమైందని తెలిపారు. పేదల పక్షపాతిగా, సంక్షేమ సారథిగా ముందుకు సాగుతున్న సీఎం వై.ఎస్.జగన్‌ను రానున్న ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, వైద్యులు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

గురుభక్తి, త్యాగనిరతికి నిదర్శనం ఏకలవ్యుడు

నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఏకలవ్యుడు విగ్రహం ఆవిష్కరణ

నెహ్రూనగర్: గురుభక్తి, త్యాగనిరతికి ఏకలవ్యుడు నిలువెత్తు నిదర్శనమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. నాజ్ సెంటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రోణాచార్యుని మీద గురుభక్తితో ఆయన విగ్రహాన్నే గురువుగా భావించి అత్యుత్తమ విలుకానిగా ఏకలవ్యుడు ఖ్యాతిని పొందాడని తెలిపారు. గురువు కోరిన వెంటనే ఏ మాత్రం సంకోచం లేకుండా విలువిద్యకు కీలకమైన తన బొటన వేలునే గురువుకి కానుకగా అందించిన త్యాగధనుడని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, విగ్రహ కమిటీ సభ్యులు కె. వెంకటేశ్వర్లు, కొండారెడ్డి శ్రీనివాసరావు, కుందనాటి సంజయ్ బాబు, మేడ శ్రీనివాసరావు, తోకల రామకృష్ణ, దేవరవాయి రామారావు, అన్నంపల్లి వెంకట పద్మారావు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మేయర్ కావటి, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్

జీఎస్టీ ఉద్యోగుల సేవాభావం అభినందనీయం

కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

పాత గుంటూరు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో రక్తదానం చేసిన జీఎస్టీ ఉద్యోగుల సేవాభావం ప్రశంసనీయమని కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. తలసేమియా రోగుల కోసం ఉద్యోగులతో రాష్ట్రంలో 18 చోట్ల రక్త దాన శిబిరాలు నిర్వహించి, 1393 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన కమిషనర్ సాధు నరసింహారెడ్డిని బుధవారం కన్నవారితోటలోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో మినిస్టీరియల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం, చిత్తశుద్ధితో విధులు నిర్వహించడం రెండూ ప్రజాసేవయేనని తెలిపారు. జీఎస్టీ మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడు శాఖమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ శాఖను అభివృద్ధి పథంలో నడిపించటమే కాకుండా ఉద్యోగులకు సేవా కార్యక్రమాల వైపు నడిపించిన ఘనత కమిషనర్ సాధు నరసింహారెడ్డికే దక్కుతుందని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రశాంత్ కుమార్, రవికుమార్, శరత్ బాబు, వెంకటేశ్వర్లు, ఆర్. శ్రీనివాసరావు, గోవర్ధన్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలుపుదల చేసి, కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విద్యార్థి, యువజన సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా లక్ష్మణరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని ప్రారంభించిన ఉద్యమం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్‌కు పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు మాట్లాడారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని, జిల్లా కార్యదర్శి వలి, కాంగ్రెస్ నాయకుడు కట్టా జవహర్ బాబు, విద్యార్థి నాయకులు శశి, షేక్ కరీం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.నరసింహ, ఎస్కే సమీర్, నాయకులు భగత్ సింగ్, యస్వంత్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుచరిత, మౌనిక, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, నర్సింగ్ విద్యార్థి సంఘ నాయకులు స్వచ్ఛంద ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చేబ్రోలు: అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో గత నెల 31న ఉమ్మడి గుంటూరు జిల్లా వాలీబాల్ అండర్–14 బాలుర, బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. ఇందులో వేజండ్ల హైస్కూలుకు చెందిన చల్లగిరి గీతామాధురి, మట్టుపల్లి జయ సంజన, షేక్ సమీరా, జోగిపర్తి నాగూర్‌బీ, కోట్ల నాగ మల్లేశ్వరి, తమ్మినేని మోహన వెంకట కార్తీక్‌రెడ్డి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా నవంబర్ 9 నుంచి 11 వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారు. విద్యార్థుల్ని హెచ్ఎం టి. విజయశ్రీ , పీఈటీ టి. వెంకటేశ్వరావు, గ్రామ పెద్దలు అభినందించారు.



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా సుధీర్‌కుమార్‌కు పురస్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారితోపాటు, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ సుధీర్‌కుమార్ ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా ఎంపికైన సుధీర్‌కుమార్ ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ నుంచి అవార్డు అందుకున్నట్లు వివరించారు.కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ వి. తేజశ్రీరెడ్డి, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మరో వలంటీర్ కె. సతీష్ ఏఎన్‌యూ స్థాయిలో ఉత్తమ వలంటీర్లుగా పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, ఎన్ఎస్ఎస్ అధికారిణి ఆర్. జయ శైలజ, కె. శ్రావణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సుధీర్‌కుమార్, తేజశ్రీ రెడ్డి, సతీష్‌ను అభినందిస్తున్న బ్రహ్మం, మనోహర్, జయశైలజ